విజ్ఞాన సౌధం పూర్తయ్యేదెన్నడో..?

- సొంత భవనం లేని జిల్లా కేంద్ర గ్రంథాలయం
- ఏడేళ్లుగా అద్దె భవనంలో అవస్థలు
- చైర్మన్ లేక మొక్కుబడిగా కార్యక్రమాలు

కడప కల్చరల్ : జిల్లా కేంద్ర గ్రంథాలయం. అపారమైన పుస్తక సంపద, వందలాది పాఠకులు, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా నిలిచిన ప్రతిష్టాత్మక విజ్ఞాన ఆలయం. నిత్యం గొప్పగొప్ప కవులు, రచయితలు, మేధావులతో కళకళలాడేది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగపడేది. ఇప్పుడదంతా గత వైభవం. ఆ విజ్ఞాన సౌధానికి సొంత భవనం లేదు. నగరానికి దూరంగా, ఇరుకిరుకు గదుల్లో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకుండా అద్దె భవనంలో నీరసంగా కొనసాగుతోంది. పట్టించుకునే వారు నిర్లక్ష్యం కారణంగా నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది.

- రూ. 5 కోట్ల బడ్జెట్‌తో పాత భవనం ఉండిన చోటే 52 సెంట్ల స్థలంలో 2021లో నూతన భవన నిర్మాణం ప్రారంభమైంది. అప్పట్లో సంస్థకు చైర్‌పర్సన్ ఉండడంతో భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. కాంట్రాక్టర్ నిర్మాణాన్ని శ్లాబ్ దశ వరకు తెచ్చాడు. అవసరమైన మేరకు నిధులు కూడా సాధించడంతో పనులు చకాచకా సాగాయి. ఆ తర్వాత ఇక త్వరలో భవనం పూర్తవుతుందన్న దశలో పలు కారణాలతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆ తర్వాత నాటి జిల్లా కలెక్టర్ విజయరామరాజు చొరవ చూపి అప్పటి నగర పాలక సంస్థ కమిషనర్ సాయి ప్రవీణ్‌చంద్‌కు భవన నిర్మాణ పనులు పురమాయించారు. తీరా ఆయన ప్రారంభించే నాటికి ఎన్నికల కోడ్ అడ్డురావడంతో పనులు ముందుకు సాగలేదు. పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉండిపోయింది.


అసంపూర్తిగా శ్లాబ్ దశలో ఉన్న గ్రంథాలయ భవనం

- నూతన భవన నిర్మాణం కోసం అప్పటి భవనం నుంచి 2018లో గ్రంథాలయాన్ని చిన్నచౌకులోని కొండాయపల్లెలోని అద్దె భవనానికి తరలించారు. నూతన భవనం త్వరగా అందిరాగలదన్న ఆశతో ఇరుకిరుకు గదుల్లోనే గ్రంథాలయం కొనసాగింది. 2020లో నూతన భవన నిర్మాణం మొదలైంది. 2018లో ప్రకటించిన మేరకు నిధులు మంజూరు కాకపోవడంతో మరోవైపు కరోనాతో నిర్మాణ పనులు మందగించాయి. తర్వాత కొన్నాళ్లు పనులు వేగంగానే జరిగాయి. శ్లాబ్ దశకు వచ్చాక పనులు ఆగిపోయాయి. పరిస్థితి మొదటికొచ్చింది. ఆ తర్వాత నిధులు రాలేదు..పనులూ జరగలేదు. భవనం లేకపోవడంతో కొండాయపల్లెలోని భవనానికి ఈ ఏడు సంవత్సరాలలో అర కోటి రూపాయలు అద్దె రూపంలో చెల్లించాల్సి వచ్చింది.
- కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్ నియామకం జరగలేదు. దీంతో పర్యవేక్షకులు లేక గ్రంథాలయంలో జరగాల్సిన పనులు నీరసించాయి. ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నా కూడా స్వంత నిర్ణయాలు తీసుకునేందుకు ఉద్యోగులకు అధికారం ఉండదు. గత ప్రభుత్వం ఇలాంటి నిరాశకు చోటు ఇవ్వకుండా విద్యార్థుల్లో పుస్తక పఠన అభిలాష పెంచేందుకు ప్రత్యేకంగా 'చదవడం మాకిష్టం'లాంటి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసింది. ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలేవీ లేవు. మరో నెల రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమవుతాయి. ఈ సమయంలో ప్రతి గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు, వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు. చైర్మన్ లేకపోవడంతో ఉద్యోగులు ఈ భారాన్ని మోసేందుకు ముందుకురారు. చేసినా మొక్కుబడి కార్యక్రమాలకే పరిమితం అవుతుంది. దీంతో ఈ వేసవిలో విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణ పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా కనిపించడం లేదు. గత ప్రభుత్వం ఈ శిబిరాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు అందజేసేది. ప్రస్తుతం చైర్మన్ లేకపోవడంతో నిధులు నామమాత్రంగా అందే పరిస్థితులు నెలకొన్నాయి. నిధులు వచ్చినా పెద్ద సంఖ్యలో హాజరయ్యే ఈ శిబిరాల నిర్వహణకు అవసరమయ్యే భవనాలు లేక కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అవకాశం కనిపించడం లేదు. శ్లాబ్ స్థాయిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ భవనాన్ని ప్రత్యేక శ్రద్ధతో తిరిగి చేపట్టి వీలైనంత త్వరగా వినియోగంలోకి తెచ్చి సంస్థకు పూర్వ వైభవం చేకూర్చాలని పాఠకులు, మేధావులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

క్లుప్తంగా

బెట్టింగ్ యాప్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజలు బెట్టింగ్ యాప్స్‌పై జాగ్రత్తగా ఉండాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ×బెట్టింగ్ యాప్స్ అప్రమత్తత అనే పోస్టర్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ×బెట్టింగ్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ×ఆనందమైన జీవితాన్ని అనుభవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ పీ.అలి ఖాన్, పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను సాధిద్దాం


భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్‌దేవ్ ల త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కు ను సాధిద్దామని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ముందస్తుగా స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్‌దేవ్ ల వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు వెంకటేష్, అల్లబకష్, వంశీ తదితరులు పాల్గొన్నారు .

రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫాను అందజేస్తున్న టూటౌన్ ఎస్ఐ హుస్సేన్, ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాయలసీమ మహిళా సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, టూటౌన్ ఎస్ఐ హుస్సేన్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని, పేదలైన ముస్లిం మహిళలకు రాయలసీమ మహిళా సంఘం నాయకురాలు తస్లీమ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను నగరంలోని రహమతీయ ఫంక్షన్ ప్యాలెస్‌లో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తస్లీమ్, లక్ష్మీదేవి, కరిమున్, చాంద్ బేగం నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దళితుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేవీపీఎస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో జకరయ్య, మనోహర్, జితేంద్ర , అన్వేష్ రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, రఘు , నాగేంద్ర , జార్జి ,బాబు, డేవిడ్ , నరసయ్య, రవి, వెంకటేశు, రాయప్ప , నరసింహ, మహేష్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: నిర్మల ఫార్మసీ కళాశాలలో శనివారం పాఠ్య పుస్తకాలు, లాబొరేటరీ భద్రతా వస్తువులు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు నూతనంగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్త కాలు, లాబొరేటరీ రికార్డ్స్, ఆప్రాన్స్, మాస్క్ లు, గ్లౌజులు తదితర వస్తువులు ఉచితంగా పంపిణీ చేశారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా బాధ్యుడు డబ్ల్యు రాము కోరారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వర్గాలు ఐక్యమైన సందర్భంగా శనివారం కడప నగరంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ముఖ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్ల్యు రాము మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటైతే జిల్లాలో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు.

'లేపాక్షి'లో డిస్కౌంట్‌తో విక్రయాలు

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఎంపోరియం లేపాక్షి షోరూంలో 10–50 శాతం డిస్కౌంట్‌తో విక్రయాలు జరుగుతున్నాయి. ఈనెల 31వ తేదీ వరకు ఈ పద్ధతి కొనసాగనుంది. ఇందులో రాష్ట్రంలోని ప్రముఖ హస్తకళలకు పేరుమోసిన ప్రాంతాల నుంచి నిపుణులు రూపొందించిన కళారూపాలను విక్రయిస్తున్నారు. ప్రత్యేకించి బొబ్బిలి వీణలు, కొండపల్లి కొయ్య, ఏటికొప్పాక లక్కబొమ్మలు, లేస్‌ల అల్లికలు, వైట్ ఉడ్ బొమ్మలు, లెదర్ ల్యాంప్ షేడ్‌లు, రాజా రాణి, అవ్వాతాతల బొమ్మలు, సంస్కృతి సంప్రదాయాలు, పల్లెపట్టులను ప్రతిబింబించే కళారూపాలను విక్రయిస్తున్నారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ధరలతో విక్రయాలు చేపట్టామని నిర్వాహకులు తెలియజేశారు.

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపరాదు


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరికి ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు ఎంతో అవసరం అని, దానిని చిన్న వయసు వారు నడపరాదు అని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జావీద్ అన్నారు. శనివారం రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగార్జున మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మోటార్ బైక్ నడపడంపై సూచనలు, సలహాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ఇబ్బంది పడకూడదనే ప్రేమతో ద్విచక్ర వాహనాలు ఇస్తుంటారని, మైనర్లకు అలా ఇవ్వడం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ రషీద్ సంఘ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి, మానవత సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి, రాటాల గోపి, సుబ్బరాయుడు , విద్యార్థినిలు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధకాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజలు వ్యాధి నిరోధకాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలని డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. శనివారం కడప నగర పరిధిలోని నాగరాజు పేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలోని మూడవ సచివాలయం అంగన్వాడీ సెంటర్‌లో ×ప్రపంచ నీటి ప్రాముఖ్యత దినోత్సవం. వ్యాధి నిరోధక కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు ప్రతి ఒక్కరికి అత్యవసరమని, నీటిని జాగ్రత్తగా వివిధ అవసరాలకు వాడాలన్నారు. అలాగే తాగడానికి కాచి చల్లార్చిన నీటిని లేదా ప్యూరిఫైడ్ వాటర్ ని మాత్రమే వాడినట్లయితే వివిధ రకాల అంటువ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే చంటి బిడ్డలకు డ్యూ డేట్ ప్రకారం తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించినట్లయితే 13 ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్, డాక్టర్ మొహమ్మద్ సమీద్, డాక్టర్ జుమ్మా , ఏఎన్ఎం మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ కడప నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ విమర్శించారు. శనివారం స్థానిక మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టాలు పడి ఆంధ్రప్రదేశ్‌కు ఎంబార్కేషన్ పాయింట్ తెస్తే దాన్ని కేంద్రం ఇటీవల రద్దు చేసిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గతంలో హైదరాబాద్‌లో ఎంబార్కేషన్ పాయింట్ ఉన్నప్పుడు ఏపీ నుంచి హజ్ యాత్ర చేస్తున్న వారికి సరైన వసతులు కల్పించే వారు కాదన్నారు. వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించేవారని ఆరోపించారు. హజ్ యాత్రలో అక్కడ వృద్ధులు ఫ్లాట్‌ఫారాలపై పడుకొన్న సందర్భాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ కళ్లారా చూసిన అంజద్‌బాషా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్‌ను సాధించారని, హజ్ యాత్ర చేస్తున్న వారికి మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు టీడీపీలో ఉన్న జిల్లా నేతలు కూడా 2022, 2023లో హజ్ యాత్ర చేశారని, వారికి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలన మేలు జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు వాస్తవాలు మాట్లాడాలని, ముస్లిం మైనార్టీలపై ప్రేమ చూపండిగానీ, పదే పదే అబద్ధాలు చెప్పి నిజం చేయాలని చూడొద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు జఫ్రుల్లా, అబ్దుల్ సుభాన్, డీజే అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అందరికీ సురక్షిత తాగునీరు

కడప ఎడ్యుకేషన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అందరికీ సురక్షితమైన తాగునీరు అందించవచ్చని గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కరీముల్లాబాష పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో శనివారం ఎన్ఎస్ఎస్, జియాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జిల్లా నీటి సంరక్షణ అవసరం, ఆవశ్యకత, నీటి సంరక్షణ పద్ధతులు మొదలైన అంశాలను విద్యార్థులకు వివరించారు. చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని వాటి స్థాయి పెంచుకోకపోతే భవిష్యత్తులో తాగునీటి సమస్య అధికమవుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుతూ వర్షపు నీటిని ఇంకుడు గుంతలు సహాయంతో ఒడిసి పట్టుకొని భూగర్భ జలాల స్థాయి పెంచాలన్నారు. ఇది ప్రతి ఒక్కరూ వారి కర్తవ్యంగా భావించి అమలు చేయాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్ మాట్లాడుతూ నీటిని సంరక్షించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, డాక్టర్ రమేష్ యాదవ్, డాక్టర్ అంకాల నాగరాజు, జియాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డిప్టామెంట్ మహేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు పదిమంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది యువతను ఎంపిక చేసినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ తెలిపారు. అన్నమయ్య, కడప జిల్లా వ్యాప్తంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివచ్చిన యువత 'వన్ నేషన్ –వన్ ఎలక్షన్' అనే అంశం పై తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియజేసినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియ జేసి దేశ స్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.


విజేతలుగా నిలిచిన యువతి, యువకులతో అధికారులు

యూత్ పార్లమెంటు ఉపన్యాస పోటీలలో విజేతల వివరాలు...

వెంకట సాహిత్య, షేక్ అమీషా నాజ్, ప్రొద్దుటూరు దస్తగిరి భాష, జె.పి సంజన, షేక్ అర్షియా అహ్మద్, మహమ్మద్ కౌసర్, ఆకుల కంబగిరి స్వామి, కె వెంకట సాయినాథ్ రెడ్డి , హేమంత్ కుమార్, వివేకానంద రెడ్డి.

వైవీయూ వీసీని కలిసిన ఏఎఫ్‌యూ వీసీ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన అల్లం శ్రీనివాసరావును డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఇరువురు వీసీలు విశ్వవిద్యాలయాల ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించుకున్నారు. యోగివేమన యూనివర్సిటీ కంట్రోల్‌లో ఉన్న గురుకుల భవనాలలో ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని నిర్వహించుకొనుటకు అనుమతించవలసిందిగా కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి పంపిన ఉత్తర్వులను అందచేశారు. ఈ ఉత్తర్వుల మేరకు త్వరలో ఒక నిర్ణయం తీసుకుని యూనివర్సిటీని నిర్వహించుకొనుటకు సహకరించాలని కోరారు.

విశ్వవిద్యాలయం తల్లి లాంటిది

మన తల్లిని మనం ఎంతగా ఇష్టపడతామో మన విశ్వవిద్యాలయాన్ని అంతే స్థాయిలో అభిమానించి ప్రగతి కోసం కృషి చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో ఆచార్యులు, సహాయ ఆచార్యులతో ఆయన సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయ సమగ్ర ప్రగతికి ఆయన రూపొందించిన 8 పారామీటర్స్ అధ్యాపకులకు వివరించారు. జాతీయ విద్యా విధానం 2020 అనుసరించి మనం సమర్థవంతంగా పని చేయాలన్నారు. ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డి, ఆచార్యులు పాల్గొన్నారు.


వైవీయూ వీసీ శ్రీనివాసరావుకు పూలగుచ్ఛం అందచేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథకుమార్

వైవీయూ వసతి గృహాల తనిఖీ

యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహాలను ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల డైనింగ్ హాల్, కిచెన్, ఆహార పదార్థాల తయారీని ప్రత్యక్షంగా పరిశీలించారు. భోజనం, కూరలు రుచికరంగా ఉన్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు తయారు చేసిన భోజన పదార్థాలను ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డితో కలిసి భోంచేశారు. సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. వసతి గృహాల నిర్వహణ గురించి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి వీసీ కి వివరించారు.

వైవీయూ వీసీకి శుభాకాంక్షలు

వైవీయూ కొత్త ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును నాన్–టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లం రాజశేఖర్ రెడ్డి , సభ్యులు కలిసి శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాన్–టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆయన నాయకత్వంలో విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సభ్యులు నవీన్, శివ ప్రసాద్, రామసుబ్బయ్య, మల్లేశ్వర్ రెడ్డి, వాసు, అశోక్ రెడ్డి, రేణు, త్యాగరాజు, మహబూబ్ బాషా. రమణా రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాల భైరవ స్వామికి పూజలు


విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాలలోగల కాలభైరవపురంలో శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. కాలాష్టమిని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు మేరువ బాలాజీరావు పర్యవేక్షణలో అర్చకులు శ్రీధర్‌శర్మ ఉదయం నుంచి స్వామి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. భక్తులు ప్రత్యేకంగా గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రముఖులు హరినాథ్‌రెడ్డి మనవడు సాయిపూజిత్ ఈ సందర్భంగా రూ. 30,051 ఆలయానికి విరాళం అందజేశారు. నిర్వాహకులు భక్తులందరికీ మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మృత్యుంజయ కుంటను అభివృద్ధి చేయరా..?


ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయకుంట అభివృద్ధిని విస్మరించడం దారుణమని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం సీపీఎం ప్రచారయాత్రలో భాగంగా మృత్యుంజయకుంటలో ప్రచార చైతన్య యాత్రలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని మృత్యుంజయ కుంట దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇంటి పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను అన్ని రకాల పన్నులు కార్పొరేషన్‌కు కడుతున్నారని, అయినా కార్పొరేషన్ పాలక వర్గాలు మృత్యుంజయ కుంట అభివృద్ధిని విస్మరించడం తగదని తెలిపారు. ఎన్నికల ముందు ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులు ఈరోజు అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఈ ప్రచార యాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, జమీల ,కుమారస్వామి రెడ్డి, రవి, శివరాం, విజయ్, నరసింహ, ఏం వెంకటేశ్వర్లు, స్టీఫెన్, శంషాద్, సరిత పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్: పేద వర్గాల ఆకలిని తీరుస్తూ శనివారం నగరవాసి ఉదయ భాస్కర్ నగరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్టాటిస్టికల్ అధికారి జీవీ స్వరూప్‌కుమార్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పేదల ఆకలి తీర్చడం పుణ్యకార్యమని, దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని ఆయన సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి


వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పాటించకపోతే చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కడప నగర శివార్లలోని రాజంపేట రోడ్డులోని బైపాస్ వద్ద రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ అక్కడికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, ఆర్‌సీ, త్రిబుల్ డ్రైవింగ్ లను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారికి జరిమానా విధించారు.

బాలిక అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో ఆజాద్ స్ట్రీట్ హోంగార్డు కాలనీలో నివాసం ఉంటున్న జ్యోతి మహేశ్వరి (15) అనే బాలిక ఈనెల 21 నుంచి కనిపించడం లేదని తల్లి భారతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పీఎస్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలియజేశారు.